సాక్షి
వికారాబాద్
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



నిబంధనలకు 'నీళ్లు'!

తాండూరు పట్టణంలో వాటర్ ఫిల్టర్ (ప్యూ రిఫై వాటర్) ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. 8లో ▸



ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుందని ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్య క్షుడు లోకుర్తి జయతీర్థచారి అన్నారు. 8లో ▸



వేసవి దుక్కులతో మేలు

యాసంగి పంట కాలం పూర్తి కాగానే వేస విలో దుక్కులు దున్నుకోవడం మేలని అధికారులు సూచిస్తున్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

సూర్యప్రభ వాహనంపై బద్రి నారాయణుడు



సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు

కొడంగల్: సూర్యదేవ నమో నమః అంటూ భక్తులు పరవశించిపోయారు. మంగళవారం ఉదయం పద్మావతీ సమేత శ్రీనివాసుడు సూర్యప్రభ వాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన వాహనంపై స్వామివారు బద్రి నారాయణమూర్తిగా పూజలు అందుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం రాత్రి స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

నిషేధిత పదార్థాల రవాణా చట్టరీత్యా నేరం

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



తాండూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్పీ, పోలీసులు

తాండూరు టౌన్: ప్రభుత్వ నిషేధిత పదార్థాల రవాణా చట్టరీత్యా నేరమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి తాండూరు రైల్వే స్టేషన్‌లో పోలీసులు ప్రయాణికుల సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పలు రైళ్లలో హైదరాబాద్ వైపు నుంచి తాండూరుకు వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, అనుమతి లేని మద్యం, డ్రగ్స్, గుట్కా వంటి పదార్థాలను గతంలో రవాణా చేస్తూ తాండూరు రైల్వే స్టేషన్‌లో పలువురు దొరికారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ మీదుగా తాండూరుకు వస్తున్న రైళ్లలో నిషేధిత పదార్థాలను రవాణా చేస్తున్నారనే అనుమానంతో తనిఖీలు చేశామన్నారు. తనిఖీల్లో తాండూరు పట్టణ, రూరల్ సీఐలు సంతోష్ కుమార్, నగేష్, ఎస్సైలు రమేష్, స్వామిదాసు, గిరి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడులు ఆపాలి

కొడంగల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులపై పోలీసులు చేస్తున్న దాడులను ఆపాలని తెలంగాణా ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారని ఆరోపించారు. యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. విశ్వ విద్యాలయాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వాటిని అమ్మకానికి పెట్టడం సరైంది కాదన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్: ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను అమ్మడానికి కుట్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. షాబాద్‌లో మంగళవారం సీపీఐ నాయకుల అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సంఘం నాయకులను రాత్రికి రాత్రే అరెస్టు చేసి నిర్బంధించడం దుర్మార్గమని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమాలు చేయకుండా నిర్బంధం విధించడం.. హైదరాబాద్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని లాక్కొని విక్రయించాలని చూడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజల ఆస్తులు మ్ముకోవడమేనా ప్రజా ప్రభుత్వం అంటే అని నిలదీశారు. గత ప్రభుత్వం సర్కారు భూములు, ప్రజల ఆస్తులను అమ్మినందుకు ప్రజలు తగిన విధంగా గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. నిర్బంధాలు, పోలీసులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నక్కలి జంగయ్య, నాయకులు రఘురాం, నారాయణ, మధు, శ్రీశైలం, రాములు, శేఖర్, రామకృష్ణ, పాండు, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ రేషన్‌షాపు వద్ద లబ్ధిదారుల క్యూ



ధారూరులో తెరుచుకోని రేషన్ దుకాణం

రాష్ట్రమంతా పండగ | సీఎం జిల్లాలో ఎండగ!

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం మంగళవారం పండుగ వాతావరణంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయగా.. సీఎం సొంత జిల్లాలో మాత్రం లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. స్థానిక ఎమ్మెల్యేలు అందుబాటులో లేరనే కారణంతో ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం పక్కన పెట్టేశారు. తొలిరోజు బియ్యం ఇవ్వకూడదంటూ పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారుల నుంచి తహసీల్దార్లు, డీలర్లకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. షాపులన్నీ తాళాలతో దర్శనమివ్వగా ఎంతో ఉత్సాహంతో వచ్చిన పేదలు నిరాశతో వెనుదిరిగారు.

ప్రారంభించారు.. మూసేశారు..



తాండూరులో మూసి ఉన్న రేషన్ దుకాణం

తాండూరు: నియోజకవర్గంలో మంగళవారం సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేసినా ఎమ్మెల్యే లేడన్న కారణంగా వాయిదా వేశారు. ఉదయం 9 గంటల నుంచే రేషన్ పంపిణీకి డీలర్లు సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో ప్రక్రియను కూడా ప్రారంభించారు. అంతలోగా రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు బియ్యం పంపిణీ ప్రక్రియను నిలిపివేయాలని డీలర్లకు చెప్పడంతో వారు దుకాణాలకు తాళం వేసి వెళ్లిపోయారు. అప్పటికే పెద్దేముల్ మండలంలోని ఐదు షాపుల్లో 149 మంది లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. తాండూరు పట్టణం, మండలంలో 3 దుకాణాల ద్వారా 10 మందికి, బషీరాబాద్ మండలంలో ఒక దుకాణంలో ఒకరికి, యాలాల మండలంలో 10 రేషన్ దుకాణాల్లో 105 మంది కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు.

సంబురాలతో సరి



మరికల్ గ్రామంలో స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: మండలంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. ఎంతో ఉత్సాహంగా రేషన్ దుకాణాలకు వెళ్లిన కార్డుదారులకు నిరాశే ఎదురైంది. దాదాపు అన్ని షాపులకు తాళాలు ఉన్నాయి. చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో కుల్కచర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ ఆధ్వర్యంలో స్థానిక నేతలు రేషన్‌షాప్ వద్దకు వెళ్లి సంబురాలు చేసుకున్నారు. కానీ రేషన్ పంపిణీ ప్రక్రియ మాత్రం జరగలేదు. ఈ విషయమై కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్‌ను వివరణ కోరగా సివిల్ సప్లయ్ అధికారుల ఆదేశాల మేరకు రేషన్ దుకాణాలను తెరవలేదని తెలిపారు. జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు రాగానే సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు.

తొలిరోజు పేదలకందని సన్నబియ్యం

- ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఆగిన పథకం
- రెండు మండలాల్లో మాత్రమే అమలు

వికారాబాద్: సన్నబియ్యం కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూసిన లబ్ధిదారులకు మొదటి రోజు నిరాశే మిగిలింది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించడంతో ఉదయం 8 గంటలకు లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు పరుగులు పెట్టారు. పది గంటలైనా దుకాణాలు తెరుచుకోకపోవడంతో ఒకింత అసహనానికి గురయ్యారు. అయ్యవారు లేక పూజ ఆగిపోయినట్లుగా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో లేకపోవడంతో అధికారులు రేషన్ దుకాణాలకు హాలిడే ప్రకటించారు. జిల్లాలో 20 మండలాలు 522 రేషన్ దుకాణాలు, 2,66,573 కార్డులు ఉన్నాయి. ప్రతినెలా 5603.408 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. మర్పల్లి మండల కేంద్రంలో, బొంరాస్‌పేట్ మండలంలో 19 రేషన్ దుకాణాలు ఉండగా ఒక్క షాపులో మాత్రమే సన్న బియ్యం పంపిణీ చేశారు. మిగతా ఎక్కడా పథకం ప్రారంభం కాలేదు. చాలా చోట్ల తహసీల్దార్లు హాజరు కాలేదు. సీఎం సొంత జిల్లాలోనే సన్న బియ్యం పథకం ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పరిగి గంజ్ రోడ్డులో మూసి ఉన్న రేషన్ దుకాణం

రేషన్ దుకాణాలకు తాళాలు

పరిగి: ఏప్రిల్ ఒకటి నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా మండలంలో ప్రక్రియ ప్రారంభం కాలేదు. స్థానిక ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నందున సన్నబియ్యం పంపిణీ చేయరాదని ఉన్నతాధికారులు డీలర్లకు ఆదేశించారు. దీంతో మండలంలోని 45 రేషన్ షాపు లు తెరుచుకోలేదు. ఈ విషయం గురించి తహసీల్దార్ ఆనంద్‌రావును వివరణ కోరగా ఎమ్మెల్యే అందుబాటులో లేనికారణంగా సన్న బియ్యం పంపిణీ మరో తేదీ పెట్టుకున్నట్టు తెలిపారు.



నవాబుపేట: ఎల్లకొండలో తెరుచుకోని రేషన్ షాపు

సన్నబియ్యం పంపిణీ వాయిదా

మోమిన్‌పేట: మండలంలో మంగళవారం ప్రారంభించాల్సిన సన్నబియ్యం పంపిణీ బుధవారానికి వాయిదా వేశారు. మూడు రోజుల క్రితమే మండల పరిధిలోని 29 రేషన్ దుకాణాలకు పది క్వింటాళ్ల చొప్పున సన్నబియ్యం సరఫరా చేశారు. ఉదయం కొన్ని గ్రామాల్లో షాపులు తెరిచినా సర్వర్ రాకపోవడంతో తాళం వేశారు. కావాలనే సర్వర్ రాకుండా చేశారని పలువురు ఆరోపించారు. ఏప్రిల్ ఒకటో తేదీ సెలవు కావడంతో బుధవారం నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు.

ఎమ్మెల్యే కోసం ఆగిన సరఫరా

నవాబుపేట: ఉగాది పండుగ నుంచే రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించింది. ఏప్రిల్ ఒకటి నుంచి అన్ని రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.. ఎమ్మెల్యే యాదయ్య స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో బియ్యం పంపిణీని బుధవారం ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ జైరాం తెలిపారు.

ఆదేశాలు రాలేదు



తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్ : మండలంలో సన్న బియ్యం పంపిణీకి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ నుంచి పేదలకు సన్న బియ్యం సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే ప్రతి రేషన్ దుకాణానికి పది క్వింటాళ్ల చొప్పున సన్న బియ్యం సరఫరా చేసినట్లు చెప్పారు. గురువారం నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించే అవకాశం ఉందన్నారు. రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం ఇస్తే చర్యలు తప్పవన్నారు. ప్రస్తుతం షాపుల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అలాగే ఉంచాలన్నారు.

నిరాశతో వెనుదిరిగిన లబ్ధిదారులు

బషీరాబాద్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది సివిల్ సప్లయ్ అధికారుల తీరు. ప్రభుత్వం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే సన్నబియ్యం పంపిణీ చేయాలని ఆదేశించినా అధికారులు మాత్రం ఎమ్మెల్యే అందుబాటులో లేడన్న సాకుతో అమలు చేయలేదు. మండలంలోని 12,759 మంది వినియోగదారులకు 278.021 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. 33 షాపులకు 10 క్వింటాళ్ల చొప్పున, మిగతా 3 దుకాణాలకు ఏప్రిల్ నెల పూర్తి కోటా సన్నబియ్యాన్ని సరఫరా చేశారు. మంగళవారం ఉదయం ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు లబ్ధిదారులు క్యూ కట్టారు. తీరా అక్కడికి వెళ్లి చూడగా షాపులకు తాళాలు ఉండటంతో డీలర్లను ప్రశ్నించారు. సన్నబియ్యం పథకం ఇంకా ప్రారంభం కాలేదని, ఉన్నతాధికారులు చెప్పేవరకు పంపిణీ నిలిపి వేసినట్లు సమాధానం ఇచ్చారు. దీంతో కార్డుదారులు నిరాశతో వెనుదిరిగారు.



బషీరాబాద్‌లో తాళం వేసిన రేషన్ దుకాణం

జిల్లా అధికారి ఆదేశాలతో..



ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభు త్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో మండలంలోని రేషన్ షాపులకు 10 క్వింటాళ్ల చొప్పున సరఫరా చేశాం. ఎమ్మెల్యే ఢిల్లీలో ఉన్నందున రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించరాదని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఫోన్‌లో మెసేజ్ పెట్టారు. ఈ కారణంగా ప్రక్రియను ప్రారంభించలేదు.

– వెంకటేశ్, తహసీల్దార్, బషీరాబాద్

దుద్యాల్ మండలంలో ప్రారంభం కాని పథకం



దుద్యాల్‌లోని ఓ రేషన్ షాప్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న సన్నబియ్యం

దుద్యాల్: మండలంలో సన్నబియ్యం పథకం ప్రారంభానికి నోచుకోలేదు. మంగళవారం ఉదయం 9గంటల ప్రాంతంలో ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు వచ్చారు. షాపులకు తాళాలు ఉండటంతో చాలా సేపు ఎదురు చూశారు. ఎంత సేపటికీ డీలర్లు రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. రేషన్ షాపులకు స్టాక్ పాయింట్ నుంచి సన్నబియ్యం వచ్చినా ఎందుకు ఇవ్వలేదని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు మానుకొని బియ్యం కోసం వస్తే షాపులు మూసి ఉంచడం సరికాదన్నారు.

ఎలాంటి సమాచారం లేదు



ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని మాకు ఎలాంటి సమాచారం లేదు. పై అధికారుల నుంచి ఆదేశాలు రాగానే ప్రక్రియను ప్రారంభిస్తాం. ప్రజలు ఎలాంటి ఆపోహలకు గురికారాదు. రేషన్ షాపులకు సన్న బియ్యం చేరింది.ఆదేశాలు రాగానే పంపిణీ చేస్తాం.

– కిషన్, తహసీల్దార్, దుద్యాల్

అధికారుల తీరుపై బీజేపీ నాయకుల ఆగ్రహం

పూడూరు: మండలంలో సన్నబియ్యం పంపిణీ వాయిదా పడింది. పక్క మండలంలో బియ్యం ఇస్తున్నారు మాకు ఎందుకు ఇవ్వడంతో లేదని డీలర్లపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చెప్పే వరకు బియ్యం ఇవ్వరాదని సివిల్ సప్లయ్ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పంపిణీ ఆపేశామని డీలర్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ఇస్తున్న బియ్యాన్ని ఎందుకు పంపిణీ చేయడం లేదని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ అధికారులను నిలదీశారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొప్పు రాజశేఖర్‌రెడ్డితో కలిసి రేషన్ షాప్‌లను తనిఖీ చేశారు.



పూడూరు: గొంగుపల్లిలో రేషన్ షాప్ వద్ద మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధారూరు మండలంలో..

ధారూరు: మండలంలోని రేషన్ షాపులన్నీ మంగళవారం తెరుచుకోలేదు. దీంతో సన్నబియ్యం కోసం వచ్చిన పేదలు డీలర్లకు ఫోన్ చేసి ఆరా తీశారు. జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేసిన వెంటనే బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. దీంతో ఇళ్లకు వెనుదిరిగారు. ఈ విషయమై తహసీల్దార్ సాజిదాబేగంను వివరణ కోరగా బుధవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ కేరెళ్లి గ్రామంలో పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. మండలానికి 248.925 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం వచ్చాయని, 10,774 మంది వినియోగదారులకు పంపిణీ చేయనున్నట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.



ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలి

- ప్రజాసంఘాల డిమాండ్

బొంరాస్‌పేట: మండలంలో ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని ప్రజాసంఘాల డిమాండ్ చేశాయి. మంగళవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, అంబేడ్కర్ సంఘం, ఎమ్మార్పీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి, ఎల్‌హెచ్‌పీఎస్, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందన్నారు. అధికారుల కనుసన్నల్లో సాగుతోందని ఆరోపించారు. అభివృద్ధి పనుల పేరిట వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. వెంటనే చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా సంఘాల జిల్లా, తాలూకా నాయకులు బుస్స చంద్రయ్య, కొత్తూరు చంద్రయ్య, రమేశ్‌బాబు, సూర్యానాయక్, సుభాష్, వెంకటయ్య పాల్గొన్నారు.

విదేశీ యువతిపై అత్యాచారం బాధాకరం

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి

మీర్‌పేట: పహాడీషరీఫ్‌లో విదేశీ యువతిపై అత్యాచార ఘటన బాధాకరమని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి అన్నారు. మీర్‌పేట మిథులానగర్‌లోని స్నేహితుడి ఇంట్లో ఉంటున్న జర్మనీకి చెందిన యువతిని మంగళవారం ఆమె పరామర్శించి మాట్లాడారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తి పెంచుకుని నెల రోజుల క్రితం యువతి దేశానికి రావడం జరిగిందన్నారు. నెల రోజుల పాటు ఎన్నో జ్ఞాపకాలు తనవెంట తీసుకెళ్దామనుకునే లోపే ఇలాంటి చేదు అనుభవం కలిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి గంటకు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, తాజాగా నాగర్‌కర్నూలు జిల్లాలో ఆలయానికి వచ్చిన వివాహితపై, ఎంఎంటీఎస్ రైలులో యువతిపై లైంగిక దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాతబస్తీ లాంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, పోలీసులు పెట్రోలింగ్ కూడా సరిగ్గా చేయడం లేదని ఆరోపించారు. విదేశీ యువతి ఘటనలో ఫొటోలు, వీడియో రికార్డింగ్‌ల వంటి ఆధారాలన్నీ ఉన్నప్పటికీ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 22 శాతం నేరాలు పెరిగాయని దుయ్యబట్టారు. హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ సిటీలో ఇంత పోలీసు వ్యవస్థ ఉన్నప్పటికీ మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు, గృహహింసలు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకుని నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శిల్పారెడ్డి వెంట బీజేపీ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, గాజుల మధు ఉన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి
ఇద్దరు మహిళలకు గాయాలు

చేవెళ్ల: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా ఇద్దరు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్లకు చెందిన ఎరుకలి సాయికుమార్(35) తన భార్య దివ్య, చెల్లెలు దీపికతో కలిసి మంగళవారం మధ్యాహ్నం బైక్‌పై శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప ఆయానికి వెళ్తున్నారు. గొల్లపల్లి సమీపంలో అతివేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో ముగ్గురూ ఎగిరి కిందపడ్డారు. సాయికుమార్‌కు తలకు బలమైన గాయం కావడంతో అంబులెన్స్‌లో చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దివ్య, దీపిక స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలీ అదృశ్యం


రాజేష్ (ఫైల్)

కేశంపేట: బతుకు దెరువు కోసం ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మంగళవారం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు రాజేష్ తన అన్న రాజుతో కలిసి మూడు నెలల క్రితం మండలంలోని నిర్దవెళ్లి గ్రామంలో ఉన్న పౌల్ట్రీ ఫాంలో పని చేసేందుకు వచ్చారు. గత మార్చి 22న రాజేష్ పని చేసే ప్రదేశం నుంచి బ్యాగ్ తీసుకొని వెళ్లి నేటికీ తిరిగి రాలేదు. ఈ మేరకు అతడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరహరి తెలిపారు. అయితే రాజేష్ గతంలో ఓ యువతిని ప్రేమించి విఫలం అయి, మానసిక పరిస్థితి బాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వలస కూలీ ఆత్మహత్య

కేశంపేట: వలస కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని చిత్రకూట్‌కు చెందిన రాధేశ్యాం(42) తన కుటుంబంతో కలిసి తొమ్మిది నెలల క్రితం మండలంలోని వేములనర్వ గ్రామంలోని పవన్‌కుమార్‌కు చెందిన మామిడితోటలో పనులు చేసేందుకు కూలీలుగా వచ్చారు. భార్యాభర్తలు ఇరువురూ అక్కడే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాధేశ్యాం తాగుడుకు బానిసై భార్య, పిల్లలను పట్టించుకోకపోవడంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో అతడు గత నెల 31న రోజు రాత్రి మద్యం తాగి భార్యతో గొడవ పడి బయటికి వెళ్లాడు. తోటలోని ఓ చెట్టుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే విషయమై మంగళవారం మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

గొడవల నేపథ్యంలో.. సోదరుడిని బైక్‌తో ఢీకొట్టి..

బంజారాహిల్స్: పాత గొడవల నేపథ్యంలో వరుసకు సోదరుడు అయిన ఓ వ్యక్తిని హోండా బైక్‌తో ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-5లోని దేవరకొండ బస్తీకి చెందిన కారు డ్రైవర్ ఉపేందర్ బస్తీలోని రాయల్ ఫుడ్ కోర్టు సమీపంలో నిలుచుని ఉన్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన అతడి వరుసకు సోదరుడైన నరేష్ బైక్‌తో ఉపేందర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇరువురి మధ్య గతంలో గొడవలు జరిగాయని దానిని మనస్సులో పెట్టుకుని బైక్‌తో ఢీ కొట్టినట్లు బాధితుడు తెలిపాడు. ఉపేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జైళ్ల శాఖకు స్కోచ్ అవార్డు

చంచల్‌గూడ: ఢిల్లీలో ఇటీవల జరిగిన స్కోచ్ సంస్థ సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ విశేష సేవలు, సంస్కరణలకు గాను అవార్డు సాధించింది. శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా స్కోచ్ సంస్థ చైర్మన్ సమీర్ కొచ్చర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జైళ్ల శాఖ చేపట్టిన ఖైదీల పునరావాసం, ఉద్యోగ కల్పన, కౌన్సెలింగ్, సామాజిక ప్రవేశం తదితర అంశాలను పరిగణిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీఐజీ సంపత్ పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు!

ఇటీవల జ్వరం బారిన పడిన పలువురు పట్టణవాసులు ఆస్పత్రికి వెళ్లగా పరీక్షలు చేసిన వైద్యులు.. కలుషిత నీటిని తాగడంతోనే ఇలా జరిగిందని నిర్ధారించారు. కొంతకాలం ఫిల్టర్ వాటర్ తాగాలని సూచించారు. అయితే తాము నిత్యం ప్లాంట్ నుంచి కొనుగోలు చేసిన నీటినే తాగుతున్నామని బాధితులు చెప్పారు. దీనిబట్టి తాండూరులోని వాటర్ ప్లాంట్లలో విక్రయిస్తున్న నీళ్లు ఎంత సురక్షితమో అర్థమవుతోంది.

- పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న ప్యూరిఫై వాటర్ ప్లాంట్లు
- తాండూరు మున్సిపాలిటీలో 60కి పైగానే.. అనుమతులు నాలుగింటికే!
- ఏటా కోట్ల రూపాయల వ్యాపారం
- అయినా ప్రజలకు అందని సురక్షిత తాగు నీరు

తాండూరు: మున్సిపల్ పరిధిలో వాటర్ ఫిల్టర్ (ప్యూరిఫై వాటర్) ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. రక్షిత నీటిని తాగాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. దీంతో జనాలు ఇళ్లలోకి సరఫరా అవుతున్న భగీరథ నీటిని ఇతర అవసరాలకు వినియోగించుకుంటూ తాగు నీటి కోసం వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు.

నామమాత్రంగానే శుద్ధి

అసలే వేసవి కాలం కాలం కావడంతో చల్లని ఫిల్టర్ నీటిని తాగేందుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న నిర్వాహకులు నామమాత్రంగా శుద్ధి చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో 60వరకు ప్యూరిఫై వాటర్ ప్లాంట్లు కొనసాగుతున్నాయి. వేసవి సీజన్ కావడంతో పెద్ద మొత్తంలో నీళ్లు విక్రయిస్తున్నారు. కానీ ఎక్కడా నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


నల్లగా మారిన బాటిళ్లలోనే ఫిల్టర్ వాటర్ తరలింపు

మండలాల్లోనూ అదే పరిస్థితి..

నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు మండలాల్లో సూమారు 180 వరకు వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. గతంలో పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ప్లాంట్లు ప్రస్తుతం గ్రామాల్లోనూ విరివిగా వెలుస్తున్నాయి. ఇలా పట్టణంతో పాటు గ్రామాల్లో ఏటా రూ.కోట్ల వ్యాపారం జరుగుతున్నా.. కనీస నిబంధనలు అమలు చేయడాన్ని కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

మున్సిపల్ నీటితోనే శుద్ధి

పట్టణంలోని 60 ప్లాంట్లలో కేవలం నాలుగింటికి మాత్రమే మున్సిపల్ అనుమతి ఉంది. మిగిలినవన్నీ అక్రమంగానే కొనసాగుతున్నాయి. నల్లాల ద్వారా తాగునీరు రాని సమయంలో బోరు నీటిని శుద్ధి చేసి 20 లీటర్ల డబ్బాలు, క్యాన్‌లలో నింపి ఆటోలలో తరలిస్తూ విక్రయిస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి సరఫరా అయ్యే తాగునీటిలో 100 నుంచి 150శాతం లోపు మాత్రమే కలుషిత కారకాలు ఉండాలి. ఇంతకు మించితే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదమే. వాటర్ ప్లాంట్ల నుంచి కొనుగోలు చేస్తున్న నీటిలో 50 శాతంలోపు మాత్రమే ఉండాలి. కానీ ఇంతకు మించి కాలుష్య కారకాలు ఉంటున్నాయని తెలుస్తోంది.

నోటీసులు జారీ చేశాం



పట్టణం మొత్తంలో కేవలం నాలుగు ప్లాంట్లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. మిగిలిన వాటికి నోటీసులు జారీ చేశాం. మున్సిపాలిటీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో తాగునీరు, ఆహారంపై తనిఖీలు చేయలేకపోతున్నాం. నీటి నాణ్యతను పరీక్షించిన తర్వాతే ప్రజలకు పంపిణీ చేయాలి.

– విక్రంసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఇవీ నిబంధనలు

- ప్లాంట్ నిర్వహణ కోసం మున్సిపల్, పరిశ్రమల శాఖ, బీఎస్ఐ నుంచి అనుమతులు పొందాలి.
- ప్లాంట్లలో మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ సిబ్బంది తప్పని సరిగా ఉండాలి.
- పీహెచ్ స్థాయి 10కి ఉండాలి. లేదంటే కిడ్నీ సంబంధిత వ్యాధులు వస్తాయి.
- నీటిని సరఫరా చేసే డబ్బాలు పరిశుభ్రంగా ఉండాలి. వీటిని నిత్యం పొటాషియం పర్మాంగనేట్‌తో కడగాలి.
- శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నంబర్ వివరాలను క్యాన్‌పై ముద్రించాలి.
- నీటిలో పూర్తిగా కరిగిపోయే లవణాలను కూడా పరీక్షించాలి.

ఇరువర్గాల పరస్పర దాడి

40 మంది యువకులపై కేసు

పరిగి: ఇరువర్గాలకు చెందిన యువకులు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడిన ఘటన పరిగిలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని ఓ వర్గానికి చెందిన యువకుడు, మరో వర్గానికి చెంది యువకుల మధ్య గత కొంత కాలంగా గొడవ జరుగుతోంది. మార్చి 30న వీరి మధ్య తుంకులగడ్డలో గొడవ జరిగింది. దీంతో కూర్చుని మాట్లాడుకుందామని నిర్ణయించిన ఇరువర్గాల వారు గత ఆదివారం రాత్రి పరిగి పీఎస్ సమీపంలోని చాయ్ అడ్డా వద్దకు చేరుకున్నారు. పరస్పరం మాట్లాడుతుండగా మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. కూల్‌డ్రింక్స్ సీసాలతో ఒకరినొకరు కొట్టుకున్నారు. అయితే మాట్లాడదామని పిలిచి తమపై దాడికి పాల్పడ్డారని ఓ వర్గం యువకులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇరువర్గాల యువకులు గ్యాంగ్‌వార్‌ను తలపించేలా ఘర్షణ పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై ఎస్ఐ సంతోష్‌కుమార్‌ను వివరణ అడగగా ఇరువర్గాలకు చెంది 40 మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పరిగి చాయ్‌అడ్డా వద్ద దాడి చేసుకుంటున్న యువకులు

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చైతన్యపురి ఠాణా పరిధిలోని ద్వారకాపురి కాలనీకి చెందిన బాలిక(5) అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతుండేంది. 2023 ఫిబ్రవరి 22న ఆమె తల్లి వారి పక్క ఇంట్లో నివాసం ఉంటున్న కాసర్ల మహేశ్ (19) వద్ద బాలికను వదిలేసి పనికోసం వెళ్లింది. కొద్ది సేపటికి ఇంటికి తిరిగి వచ్చి చూడగా మహేష్ బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు గుర్తించింది. ఈ విషయమై అతడిని నిలదీయగా ఆమెపై దాడి చేశాడు. దీంతో బాధితురాలి తల్లి చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం మంగళవారం నిందితుడికి పై విధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పింది. బాధితురాలికి రూ. 5లక్షల నష్ట పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

డీడీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లోకుర్తి జయతీర్థ చారి

దోమ: ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుందని, అర్చకులు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషిచేయాలని ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకుర్తి జయతీర్థ చారి పేర్కొన్నారు. మంగళవారం దోమ మండలం మోత్కూరు గ్రామంలోని డీడీఎంఎస్ సంఘం ప్రధాన కార్యదర్శి కరణం శ్రీకాంత్ నివాసంలో సంఘం కార్యవర్గ సమావేశాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్చకులు దేవాలయాల్లో సుచి, శుభ్రత పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా భక్తిభావం పెంపొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్చకులందరూ సంఘటితంగా ఉంటూ సమాజంలో భక్తిభావం పెంచేవిధంగా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. దూపదీపనైవేద్య అర్చక సంఘాన్ని బలోపేతం చేస్తూ సంఘంలో సభ్యత్వ నమోదును కార్యవర్గసభ్యులు క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్ సంఘం గౌరవ అధ్యక్షుడు కల్యాణ్‌రామ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు నటరాజ్ స్వామి, జగదీశ్ స్వామి, రాజశేఖర్ స్వామి, వి.శ్రీకాంత్ చారి, జె.సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జయతీర్థ చారి

3 తులాల బంగారం అపహరణ

ఓ ఇంట్లో సీసీ ఫుటేజీలో రికార్డయిన నిందితుల కదలికలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఓ ఇంట్లో చొరబడి 3 తులాల బంగారం అపహరించారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ..పట్టణంలోని ఆలంపల్లి సినిమాక్స్ థియేటర్ వెనుకాలలోని రాఘవేంద్ర స్వామి ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న ఖదీర్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి పండుగ సందర్భంగా తన స్వగ్రామానికి వెళ్లారు. అదే రోజు అర్ధరాత్రి దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడి 3 తులాల బంగారం, రూ.40వేలను అపహరించుకుపోయారని వారు పేర్కొన్నారు. మరో ఇంట్లో కూడా దొంగలు చొరబడ్డారని అందుకు సంబంధించిన వివరాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని వారు తెలిపారు. ఈ సీసీ ఫుటేజీలో దుండగులు తమ వెంట కత్తులు తెచ్చుకున్నట్లు కెమెరాల్లో రికార్డు అయ్యింది. కాగా ఈ సీసీ ఫుటేజీ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాధితులు ఘటనకు సంబంధించిన విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

గొర్రెల మందపై కుక్కల దాడి

- 21జీవాల మృత్యువాత
- తొమ్మిదింటికి గాయాలు

మొయినాబాద్: వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 21 గొర్రెలు మృతి చెందగా మరో తొమ్మిది గాయపడ్డాయి. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సురంగల్‌కు చెందిన జవ్వోజి రవియాదవ్ వ్యవసాయంతోపాటు పాడి గేదెలు, గొర్రెలను పెంచుతున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి జీవాలను దొడ్డిలో పెట్టి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో మెలకువ రావడంతో.. దొడ్డి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించాడు. గొర్రెల మంద వద్ద ఉన్న పెంపుడు కుక్కతో పాటు జీవాల అరుపులు వినిపించడంతో పొలం వద్దకు పరుగులు పెట్టాడు. రవి అరుపులు విన్న కుక్కలు అక్కడినుంచి పారిపోయాయి. వీటి దాడిలో చనిపోయిన గొర్రెల విలువ రూ.3 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.


సురంగల్‌లో వీధికుక్కలు దాడిచేయడంతో మృతి చెందిన గొర్రెలు

ఉరేసుకుని బాలుడి ఆత్మహత్య

మంచాల: ఇంట్లో ఎవ రూ లేని సమయంలో ఓ బాలుడు ఫ్యాను కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఆగాపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. మంచాల పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొర్ర సిద్దార్థ(16) ఇబ్రహీంపట్నంలోని రెసిడెన్సియల్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మూడు నెలలుగా స్కూల్‌కు వెళ్లడం లేదు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు పెట్టుకొని చీరతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులు వచ్చి చూడగా తలుపు తీయలేదు. బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ ఫొటో కూడా తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, బాడీని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తలకొండపల్లి: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తలకొండపల్లికి చెందిన చెన్నోజి కూలీ పనులు చేసుకుంటు జీవించేవాడు. గత నెల 28న ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయాడు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి కుమారుడు మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

కేశంపేట: అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న సంఘటన కాకునూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పెట్రోలింగ్‌లో విధుల్లో ఉన్న పోలీసులు కాకునూర్ గ్రామ శివారులో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండడంతో వాటిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

జన సంద్రంగా పోలేపల్లి దేవాలయం


అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

గంటల తరబడి క్యూలైన్లో భక్తులు

దుద్యాల్: మినీ మేడారంగా పేరుపొందిన పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం భక్తులతో జన సంద్రోహంగా మారింది. మంగళవారం అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు క్యూలైన్లో బారులు తీరారు. బోనాలు, కోడి పుంజులు, మేకపోతులతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం, మంగళవారం, ఆదివారం రోజుల్లో అమ్మవారిని దాదాపుగా 5 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ఈవో రాజేందర్ రెడ్డి, చైర్మన్ జయరాములు పేర్కొన్నారు. దేవాలయం పరిసర ప్రాంతాలు ఎక్కడ చూసినా భక్తులతో నిండిపోయింది. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లో భక్తులు బారులు తీరారు. దర్శనానికి గంటకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

ఖర్గే, కేసీగోపాల్‌ను కలిసిన ఎమ్మెల్యేలు


పరిగి: వేణుగోపాల్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

పరిగి: ఎంపీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను ఢిల్లీలో ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి కలిశారు. రాష్ట్రం, ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలోని రాజకీయ స్థితిగతులపై మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వేణుగోపాల్‌కు వివరించామని ఎమ్మెల్యేలు తెలిపారు.

తాండూరులో..

తాండూరు: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను మంగళవారం వికారాబాద్, రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు కలిశారు. మల్లికార్జున్ ఖర్గేను కలిసి పలు అంశాలను విన్నవించారు. త్వరలో మంత్రి వర్గ విస్తరణ చేపట్టనుండడంతో ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలని సూచించారు. ఏఐసీసీ నేతలను కలిసిన వారిలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


తాండూరు: ఖర్గేను కలిసి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యేలు

ఉపాధి కూలీలకు ఊరట

కూలి పెరిగింది

- రూ.7 పెంచిన కేంద్ర ప్రభుత్వం

దౌల్తాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజువారి కూలీ వేతనాన్ని పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన వేతనం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వచ్చింది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 28,649 జాబ్‌కార్డులు ఉండగా15,955 మంది కూలీలు ఉన్నారు. ఉపాధి కూలి పెంచడంతో మండలంలో ప్రస్తుతం పనిచేస్తున్న 2,200 మందికి ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం మండలంలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. వేసవి కావడంతో వ్యవసాయ పనులు తగ్గడంతో రోజువారి ఉపాధి పనికి హాజరయ్యే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. మండలంలో ప్రతి ఏడాది క్రమం తప్పకుండా మూడు వేల మందికి పైగా కూలీలు పనులకు వెళ్తుంటారు. ప్రస్తుతం రోజుకు 2,000నుంచి 2,200మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రస్తుతం ఫీడర్ చానల్, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, ఇంకుడుగుంతల నిర్మాణం, గుట్టల చుట్టూ కందకాలు, మట్టిరోడ్ల నిర్మాణం కందకాల తవ్వకం తదితర పనులను చేపడుతున్నారు. మరో రెండు వారాల తర్వాత 200 మందికిపైగా కూలీల సంఖ్య పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీ నిర్ణీత పని పూర్తి చేస్తే రోజుకు రూ.300 వేతనంగా చెల్లిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం రూ.7 పెంచుతూ రూ.307 చెల్లించేందుకు నిర్ణయించారు.


ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

సద్వినియోగం చేసుకోవాలి

గ్రామాల్లో కూలీలందరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి హామీ పథకంలో వేతనాన్ని రూ.300 నుంచి రూ.307ల వరకు పెంచారు. మండలంలో ప్రస్తుతం 2,000నుంచి 2,200వరకు కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది.

– అంజిలయ్య, ఏపీఓ, దౌల్తాబాద్

ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో అకౌంట్ హోల్డర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నగర వాసి నుంచి రూ.14.63 లక్షల కాజేసిన ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో నిందితుడిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నగరంలో ఉంటున్న ప్రైవేట్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా ఎర వేశారు. తాము సూచించినట్లు ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తే కనీసం 20 శాతం లాభాలు ఉంటాయని నమ్మబలికారు. తొలినాళ్లల్లో లాభాలు చూపించినా.. చివరకు బాధితుడి నుంచి రూ.14.63 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.సతీష్‌రెడ్డి నేతృత్వంలోని బృందం కొంత మొత్తం యూపీలో ఉన్న బ్యాంకు ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించింది. అక్కడకు వెళ్లిన అధికారులు సదరు అకౌంట్ హోల్డర్ శివశంకర్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చారు. నోయిడాలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఇతడిపై మరో కేసు నమోదై ఉన్నట్లు గుర్తించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ: ప్రేమ విఫలమై మనస్తాపానికి గురైన ఓ యువకుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, ప్రశాంత్ నగర్‌కు చెందిన ఉప్పరపల్లి మహేందర్ (25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అడ్డగుట్ట సొసైటీలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం హాస్టల్ గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో హాస్టల్ నిర్వాహకుడు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. ప్రేమలో ఓడిపోవడమే తన మరణానికి కారణమని రాసి ఉన్న లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.